

31న కాకినాడలో పింఛన్ అదాలత్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని పింఛనుదారుల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 31వ తేదీ, సాయంకాలం 5 గంటలకు స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పింఛను అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ డీఎస్‌యూ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలియ జేశారు. ఫిర్యాదుదారులు ఈ నెల 20వ తేదీలోపు పింఛన సేవలకు సంబం ధించిన ఫిర్యాదులు, సలహాలను పింఛను అదాలత్ శీర్షికతో సూపరిం టెండెంట్ కార్యాలయం, కాకినాడ-533001 చిరునామాకు పంపా ల్సిందిగా సూచించారు. ఫిర్యాదు దారులు వ్యక్తిగతంగా కూడా అదాలత్‌కు హాజరుకావొచ్చన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రైతు సంక్షేమానికి ఈ క్రాప్, ఈకెవైసి

ప్రజాశక్తి - కాకినాడ

పెట్టుబడి రాయితీ, సున్నావడ్డీ, పంట బీమా, ధాన్యానికి మద్దతు ధర పొందడం తదితరాల కోసం ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ స్పందనహాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి (ఏఎబీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన, పట్టు, నీటి పారుదల, డ్రైనేజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు, రైతులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు జీవీ పద్మశ్రీ, ఎ.గాయత్రీదేవి ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలను వివరిం చారు. పంట నమోదుకు సంబంధించిన జాబితాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవైనా సమస్యలు ఉంటే రైతులు సరిచేయించు కోవచ్చన్నారు. 90 శాతం ఈ-కేవైసీ పూర్తయిందని తెలిపారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచనల మేరకు హేతుబద్ధంగా యూరియాను వినియోగించాలన్నారు. వ్యక్తిగతంగానూ వ్యవసాయ పరికరాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముందుగా స్ప్రేయర్లు, టార్పాలిన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల్లో రబీకి అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

వ్యవసాయ అధికారుల సూచనలు:

- రబీ కోతలు మార్చి 31 నాటికి పూర్తయితే రైతులు తర్వాత అపరాలు వేసుకోవాలి.- డ్రోన్లతో 5 నిమిషాల్లో ఎకరం పొలంలో స్ప్రే చేయవచ్చు. డ్రోన్ పైలెట్ శిక్షణకు పాస్‌పోర్ట్ తప్పనిసరి. రైతులు శిక్షణకు ముందుకు రావాలి. బీఎస్సీ (అగ్రి) అభ్యర్థులకు 50 శాతం, మిగిలిన వారికి 40 శాతం సబ్సిడీపై డ్రోన్లను సరఫరా చేస్తారు.- సీసీఆర్సీ కార్డులపై రైతులకు క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయ సలహా మండళ్ల సభ్యులు అవగాహన కల్పించాలి.

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ఎస్.సూర్య పకాశ్‌రావు మాట్లాడుతూ ఇటీవల కొన్ని పశువుల్లో స్వైన్ ఫ్లూ వ్యాధి లక్షణాలు స్వల్పంగా కని పించాయని వాటి నివారణ కోసం అన్ని మండలాల్లో వాక్సిన్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా లింఫీ స్కిన్ వైరస్ మందులు కూడా అందుబాటులో ఉన్నాయ న్నారు. తమ శాఖ ద్వారా దాణాను రాయితీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నట్లు తెలి పారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఉచితంగా పంపిణీకి ఆయిల్‌పామ్ మొక్కలు మండలాల నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం సోలార్ కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి రైతుల గ్రూపులకు 75 శాతం సబ్సిడీ అందజేస్తోందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత ఉద్యాన శాఖాధికారిని సంప్రదించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వారు చిన్నతరహా పరిశ్రమలకు లక్ష నుండి 30 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారని సదరు పరిశ్రమలకు 35 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ ఉందని, 10 శాతం రైతుకట్టాలని, 55 శాతం బ్యాంకు లోను ఇస్తున్నదని తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ ఇటీవల అధికారులతో కలిసి జిల్లా అంతటా క్షేత్ర సందర్శనలు నిర్వహించినట్లు చెప్పారు. వరిపై ఎల్లో స్టెమ్ బోరర్ ను గమనించినట్లు తెలిపారు. దీనిపై అధికారులు రైతులకు సూచనలు చేయాల న్నారు. ఈ నెల 29వ తేదీన మార్టేరులో జోనల్ స్థాయిలో నిర్వహిస్తున్న కిసాన్ మేళాలో శాస్త్రవేత్తలతో మాట్లాడి సందేహాలు నివత్తి చేసుకోవచ్చన్నారు. కొత్త రకం వంగడాలు, వ్యవసాయ ప్రదర్శనలు ఉంటా యన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, నాబార్డు డీడీఎం సోమునాయుడు తదితరులు హాజరయ్యారు.

జిల్లాలో జ్వరాల ముసురు

- వాతావరణ మార్పులతో విజంభిస్తున్న రోగాలు
- పిహెచ్‌సి లలో కానరాని సౌకర్యాలు
- ప్రయివేటుకు ఆశ్రయిస్తున్న రోగులు
- పేదల జేబులు గుల్ల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య రోజుకి పెరుగుతోంది. దాదాపు ప్రతి గ్రామంలోనూ వైరల్ ఫీవర్ బారిన పడినవారి సంఖ్య అధికమవుతోంది. ఎంతో మంది తరచుగా జ్వరం, జలుబు, దగ్గువంటివాటి లక్షణాలతో ఆసుపత్రులకు రావడం సాధారణంగా మారింది. మందులు వాడితే తగ్గిపోవడం, మళ్లీ పది, పదిహేను రోజులకోసారో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఇన్ ఫ్లూయెంజా (హెచ్3 ఎన్2) బారిన పడినవారు ఎక్కువగా వైద్యం కోసం వస్తున్నారని పలువురు డాక్టర్లు తెలిపారు. మరోవైపు చిన్నారుల్లో స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయని చెబుతున్నారు. జిల్లాలో వైరల్ జ్వరాలతో దగ్గు, జలుబు, ఆయాసం, కాళ్లు, కీళ్ల నొప్పులతో పలువురు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో చేరుతు న్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్యాధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో జ్వరాలు సర్వసాధారణం అయితే ఈ ఏడాది పూర్తి భిన్నంగా జ్వరం పీడుతులు విపరీతంగా పెరుగుతున్నారు.

ప్రధానంగా కాకినాడ జిజిహెచ్‌కు రోజుకు సుమారు 500 నుంచి 1000 మంది వరకు వైరల్ ఫీవర్స్ తో బాధపడుతున్న ఓపీలే ఎక్కువగా వస్తున్నాయి. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం నాలుగు నుంచి వారం రోజులపాటు ఇన్ పేషెంట్లుగా ఉంచి వైద్యం అందిస్తున్నారు. వీరితోపాటు టైఫాయిడ్, డెంగీ వంటి కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇన్ ఫ్లూయెంజా లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్న తరుణంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, ఆస్తమా తదితర పేషెంట్లు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

● ప్రయివేటుకు పరుగులు

ఉమ్మడి జిల్లాలో 12 పీహెచ్సీలు ఉన్నాయి. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండడం లేదు. పారిశుధ్య క్షీణిస్తోంది. పూర్తి స్థాయిలో సిబ్బంది కరువయిన పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది పనితీరు మెరుపడడం లేదు. సరిపడా వైద్యులు పోస్టుల భర్తీ చేయడం లేదు. నలుగురు ఉండాల్సిన చోట ఇద్దరు, ముగ్గురు ఉండాల్సిన చోట ఒక్కరే సేవలు అందిస్తున్న దుస్థితి నెలకొంది. తాగునీటి వసతి, రోగులు ఉండే చోట ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం, అరకొర విద్యుత్ సరఫరా ఇలా అనేక సమస్యలతో రోగులు సతమతం అవుతున్నారు. దీంతో పలు పీహెచ్ సీలలో ప్రాథమిక వైద్యసేవలే దిక్కవుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు రోగులు జిల్లా కేంద్రంలో ఉన్న కాకినాడ జిజిహెచ్ కు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడంతో అనేకమంది ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. మధ్యతరగతి వర్గాల ప్రజలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారు.



కాకినాడ జిజిహెచ్ లో జ్వర పీడితులతో కిక్కిరిసిన వార్డు


దగ్గు, ఆయాసం వస్తుంది



గత నాలుగు రోజులుగా తీవ్రంగా దగ్గు ఆయాసం వస్తుండడంతో జిజిహెచ్ కు వైద్య సేవల కోసం వచ్చాను. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఉదయం వస్తే మధ్యాహ్నం ఒంటి గంట తరవాత కూడా వైద్యులు పరీక్షలు చేయలేదు.

కట్టామురి మునియ్య, రోగి, కాకినాడ

సౌకర్యాలు అందుబాటులో లేవు



ఎన్ని మందులు వాడినా గత వారం రోజులుగా జ్వరం తగ్గడం లేదు. రంగంపేటలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో సరైన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో కాకినాడ జిజిహెచ్ కు వచ్చాను. ఇక్కడ కూడా సేవలు ఆలస్యం అవుతున్నాయి.

యానాల చక్రం, సింగంపల్లి, రంగంపేట మండలం

అకాల వర్షాలతో అపరాల రైతుల బెంబేలు





అకాల వర్షంతో కోటనందూరు మండలంలో మినుములు, పెసర పంటలను కుప్పలుగా వేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - కోటనందూరు

అకాల వర్షాల కారణంగా అపరాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు మెట్ట ప్రాంతమైన కోటనందూరు మండలంలో దాల్వా పంటకు సాగు చేయడానికి అనుకూలంగా లేని భీమవరపుకోట, ఎస్ఆర్ పేట, అప్పలరాజుపేట, అల్లిపూడి, కాకరాపల్లి, కెఇ చిన్నయ్యపాలెం, ఎల్.డి.పేట, పరిసర గ్రామాలలో అపరాల పంటలు మినుములు, పెసలు సాగు చేశారు. ముందుగానే విత్తనాలు నాటి పంట చేతికి రాగానే కొన్నిచోట్ల రైతులు పంటను విక్రయించుకున్న పటికీ ఆలస్యంగా సాగు చేసిన మినుములు పెసలు పంటలు ఇప్పటికే పంట పొలాల్లోనే ఉండి పోయాయి. అల్పపీడన ప్రభావం వల్ల శుక్రవారం వర్షం కురవడంతో అల్లి పూడి గ్రామంలో మినుములు, పెసలు పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అందివచ్చిన పంట తడిసిపోకుండా పంట పొలాల్లోనే మినుములు పెసల పంటలను కుప్పలుగా వేసి బరకాలు కప్పుతున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష సజావుగా జరిగింది. 60 కేంద్రాల్లో జనరల్ 19,972 మందికి 19,179 మంది, వత్తివిద్య 1569 మందికి 1465 మంది హాజరైనట్లు డీవీఈవో జీజీకే నూకరాజు తెలిపారు.

20, 21 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలోని 11 ప్రాంతాల్లో ఈ నెల 20,21 తేదీలలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఆధార్‌లో ఉన్న పాత తూర్పు గోదావరి జిల్లా స్థానంలో కాకినాడ జిల్లాగా తప్పనిసరిగా మార్పు చేసుకునేందుకు ఈక్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి అనుసంధానం చేయడంతోపాటు, చిరునామాలు, పుట్టినతేదీల్లో మార్పులు వంటి ఇతర సేవలను కూడా పొందవచ్చునన్నారు. కాకినాడ నగరంలోని కష్ణనగర్-2ఎ, డైరీఫారం-11ఎ, గోలీలపేట -14ఎ, యానాంరోడ్డు -15ఎ, చిన్న మార్కెట్-21ఎ, యాళ్ళవారివీధి -28బి, జగన్నాథపురం -30బి, బ్యాంకుపేట- 32ఎ, గాంధీనగర్-38ఎ, రామారావుపేట- 40బి, గైగోలుపాడు-50బి సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న జెసి ఇలాక్కియా

పటిష్టంగా సమగ్ర భూసర్వే

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రీ సర్వే పనుల పురోగతి, స్టోన్ ప్లాంటేషన్, రైతులకు భూపత్రాల పంపిణీ తదితర అంశాలపై శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జెసి ఇలాక్కియా రెవెన్యూ, సర్వే, ఇతర శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా సరిహద్దు తగాదాలతో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల స్వచ్ఛీకరణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.

సమగ్ర భూ సర్వేకు సంబంధించి జిల్లాలో తొలి దశలో 121 గ్రామాల్లో సర్వే పనులు చేపట్టడం జరిగిందని జేసీ తెలిపారు. సర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూహక్కుపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రెండో దశలో 87 గ్రామాలకు గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభమయ్యా యని రైతులకు ముందుగానే సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించి, సరిహద్దు రైతులకు ఎటువంటి వివాదాలకు తావులేని విధంగా సర్వే ప్రక్రియ నిర్వహిం చాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది సమన్వయంతో పూర్తిప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు భూములు ఉన్న గ్రామాల్లో అటవీ శాఖ అధికారులతో సమ న్వయం చేసుకుని రెవెన్యూ, సర్వే అధికారులు పనిచేయాలని జెసి ఇలాక్కియా ఆదేశించారు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల వారీగా ఆయా మండలాల వారీగా రీ సర్వే పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదుర వుతున్న వివిధ సమస్యలను జేసీ.. తహశీల్దారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మండల రెవెన్యూ, సర్వే అధికారులకు సమగ్ర భూ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ తదితర అంశాలపై మెలకువలను పీపీటీ ద్వారా జేసీ అవగాహన కల్పించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారులు బీవీ రమణ, జె.సీతారామారావు, ఏడీ సర్వే బి.లక్ష్మీనారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు, డీటీలు ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.



పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

మోడీ అదానీ ద్వయంతో దేశానికి ప్రమాదం

ప్రజాశక్తి - పిఠాపురం

మోడీ ఆదాని ద్వయంతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని సిపిఎంజిల్లా నాయకులు డి.శేషబాబ్జి అన్నారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదానికి ప్రజల ఆస్తులను ఎలాగా కట్టబెడుతుందో అనే పుస్తకాన్ని ఆవిష్కరించి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి శేషబాబ్జి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అదానికి కూడబెడుతున్న సంస్థలు అన్నీ కూడా ప్రజల ఆస్తులని ఈ ఆస్తులను కాపాడాలని సిపిఎం ఈ నెల 14 తేదీ నుంచి 24 తేదీ వరకు ప్రచార కార్యక్రమలు చేస్తోందన్నారు. బిజెపి ప్రభుత్వం అదానికి పోర్టులు, ఎయిర్‌లైన్స్, ఎల్ఐసిలోని ఉన్నవాటాలను అప్పజెప్పిందన్నారు. అదాని కంపెనీలు అన్నీ ఒకటి ఒకటిగా నష్టాల్లో కూరుకు పోతున్నాయని తాజాగా హిడెన్‌బర్గ్ నివేదికలో ప్రచురణ జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర నుంచి తీసుకున్న అప్పులను తక్షణమే చెల్లించాలన్నారు. గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానికి ఇచ్చే ఆలోచనను విరమించుకోవా లన్నారు. తక్షణంఆదాని పైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కోనేటి రాజు,కె చిన్న, విశ్వనాథం, నాగేశ్వరరావు, వీరబాబు, మణి సూర్యనారాయణ, రాజేష్, అప్పన్న, సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపు

- మార్చి 31 వరకు అవకాశం
- కార్పొరేషన్ కమిషనర్ రమేష్ వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించిందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. కోవిడ్ నేపథ్యంలో అపరాధ రుసుము చెల్లించలేక ఎంతోమంది పన్ను చెల్లింపుదారులు బకాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా బకాయిలు చెల్లించని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపు దారులు వడ్డీ లేకుండా పన్ను చెల్లించవచ్చునన్నారు. పాత బకాయి తో పాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర బకాయిని కూడా ఏక మొత్తంగా ఈ నెల 31వ తేదీ లోపుగా చెల్లిస్తే ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ రాయితీ వల్ల కాకినాడ నగరపాలక సంస్థలోని పన్ను చెల్లింపు దారులకు రూ 10 కోట్ల భారం తగ్గి ప్రయోజనం చేకూరుతుందన్నారు. మొండి బకాయిదారులంతా పన్నుల మొత్తం చెల్లిస్తే రూ 8 కోట్ల పాత బకాయిలు వసూలయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ఆదాయంతోనే కాకినాడ నగర అభివృద్ధి సాధ్యమని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వడ్డీ రాయితీ ప్రయోజనాన్ని పొందడంతో పాటు నగర అభివృద్ధిలో ప్రజలు కూడా తమ వంతు భాగస్వామ్యం వహించాలని కమిషనర్ రమేష్ కోరారు.

బకాయి పన్ను చెల్లింపులో వడ్డీ మాఫీ కి అవకాశం

పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాల పై ఇంటి పన్నుల, ఖాళీ స్థలం పన్నుల పై నూటికి నెలకు 2 శాతం చొప్పున విధిస్తున్న అపరాధ రుసుము(పెనాల్టీ వడ్డీ)పూర్తిగా మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ఎం రామ్మోహన్ శుక్రవారం ఒక తెలిపారు.ఆ ప్రకటనలో అనేక కారణాలు వలన గడిచిన సంవత్సరాల నుండి పన్నులు చెల్లించకుండా ఉన్న భవనాలు, ఖాళీ జాగా పనులపై 31 మార్చి 2023 వరకు పేరుకుపోయి వున్న బకాయిలు వడ్డీ లేకుండా చెల్లించేందుకు వన్ టైం సెటిల్మెంట్ పద్ధతిన ఈనెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకొని వడ్డీ రాయితీ పొంది పన్నులు చెల్లించా లన్నారు. నీటి పన్ను బకాయిలు కూడా యధావిధిగా వడ్డీ లేకుండా చెల్లించవచ్చునని ఇతర వివరాలు సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు లెనిన్ బాబు

సమాజ రుగ్మతలకు కారణం పెట్టుబడిదారీ వ్యవస్థే

ప్రజాశక్తి - కాకినాడ

నేడు అన్ని రుగ్మతలకు కారణం పెట్టుబడిదారీ వ్యవస్థేనని అధ్యాపకులు పెద్దింశెట్టి లెనిన్ బాబు అన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాల పూర్వ నాయకులు వాసంశెట్టి సూర్యారావు 4వ వర్ధంతి సందర్భంగా స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం అధ్వర్యంలో శుక్రవారం జరిగిన స్టడీ సర్కిల్‌లో వర్తమానంలో మార్క్సిజం ప్రాధాన్యత అనే అంశంపై ముఖ్యవక్తగా లెనిన్ బాబు ప్రసంగించారు. కారల్‌మార్క్స్ మార్క్సిస్టు తత్వశాస్త్రం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. పూర్వ అధ్యాపకులు కట్టా కష్ణారావు మాట్లాడుతూ నేడు బిజెపి పాలనలో సామాజిక, ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటూ ప్రపంచంలో చిన్నబోతుందని, దేశంలో ప్రజలు కుల, మతాలకు అతీతంగా ఐక్యమై మత శక్తులను గద్దె దించాలని అన్నారు. కార్యక్రమంలో ముందుగా సూర్యారావు, మాతాజీల చిత్ర పటాలకు సీనియర్ సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకష్ణ, కర్రి నాగేశ్వరావు మహిళా సంఘం నాయకులు రమణి, పద్మ, నాగదేవి, అనంతలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షత వహిం చగా, జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, శేషబాబ్జీ, వల్లు రాజబాబు మాట్లాడారు. సమావేశంలో సి హెచ్.విజయ్‌కుమార్ వేదికపైకి వక్తలను ఆహ్వానించగా, సోని వందన సమర్పణ చేశారు. అజయ్ కుమార్, సత్తిరాజు, వర్మ, వెంకటరమణ, ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మేడి బడ్జెట్ చూడ మేలిమై ఉండు..
పేజీలు తిప్పి చూడ అప్పులుండు..!!

19న కరప మండల ఉపాధి ప్రజా ఆడిట్

ప్రజాశక్తి -కరప

కరప మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము లో చేపట్టిన వివిధ రకాల పనులపై ప్రజా ఆడిట్ ను ఈనెల 19 నిర్వహించినట్లు ఎపిఒ పి.రమణ కుమార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2021 ఏప్రిల్ నుండి 2023 మార్చి చివరి నాటికి కరప మండల గ్రామాలలో చేపట్టిన వివిధ రకాల ఈ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ ను ఈనెల 19న మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదికను ఏర్పాటుచేసి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పనుల్లో వచ్చే అభ్యంతరాలను, అవకతవకలు ఏమైనా ఉంటే మండల అభివృద్ధి అధికారి కె.స్వప్న ఆధ్వ ర్యంలో నివేదిక సమర్పించుట జరుగుతుందని ఏపీవో ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధం : టిడిపి

ప్రజాశక్తి -కాజులూరు

రాష్ట్రంలో గత మూడున్నర సంవత్సరాలుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని చెప్పు కుంటున్న వైసీపీ నేతలకు శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. శుక్రవారం కాజులూరు అంబేద్కర్ భవనంలో టిడిపి మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ టిడిపి హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించా రన్నారు. రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాలుగా అభివృద్ధి కుంటు పడిందన్నారు. టిడిపి నాయకులు వైసీపీలో చేరుతున్నారని చెప్పడం హాస్యా స్పదంగా ఉందన్నారు. వైసిపి పార్టీలోనే మూడు వర్గాలు ఉన్నాయని వారిలో వారినే మరల పార్టీలో చేర్చు కుంటున్నారన్నారు. రాష్ట్రంలో అభివద్ధి జరిగిందని తెలుపుతున్న వైసీపీ నేతలతో రాష్ట్రంలో అభివృద్ధిపై తాను ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లయితే అనేక సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడు తుందన్నారు. పూర్వ వైభవానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి అన్నారు. కార్యక్రమంలో రాయుడు లీల శంకర్ వనుము వీరబ్రహ్మం రెడ్డి శేషారావు కురుపూడి కొండ, బండారు భూరయ్య పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రైవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందించాలని సీఎంఓ చామంతి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. ఉద్దేశంతో ఉన్నదని గండేపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో గండేపల్లి, మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎంఓ చామంతి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పిల్లల క్లాస్ రూములు, మధ్యాహ్నం భోజనం పథకం, తదితరి విషయాలు పరిశీలించారు. విద్యార్థిని విద్యార్థులు విషయాల్లో ఉపా ధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహిం చాలని ఆయన సూచించారు. అదేవిధంగా మల్లేపల్లి భవిత కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులు పరిశీలిం చారు. కారక్రమంలో సిఆర్పిలు తాతబాబు, ఎస్.లావా ప్రకాష్‌రావు, హెచ్ఎం జి సుధా మాధురి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

అనారోగ్యంతో హాస్టల్ విద్యార్థిని మృతి

వార్డెన్ నిర్లక్ష్యమేనని తల్లిదండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి-రామచంద్రపురం


మణికుమారి(ఫైల్)

మండలంలోని హసన్ బాద గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని పులిదిండి మణికుమార్ (13) అనారోగ్యంతో మృతి గురువారం చెందింది. తన ప్రకారం విద్యార్థిని తల్లి దండ్రులు చెప్పిన వివరాలు ఇవి. హసన్ బాదకు చెందిన పులిదిండి శ్రీను, కృష్ణవేణి కుమార్తె అయిన మణి కుమారిని కాకినాడలోని ప్రభుత్వ ఉమెన్స్ హాస్టల్లో చేర్పించారు. విద్యార్థిని ఆదివారం నుంచి అస్వస్థ గురైంది దీంతోపాటూ విద్యార్థినికి తలనొప్పి, వాంతులు మొదలయ్యాయి. దీనిపై హాస్టల్ వార్డెన్ తాత్కాలికంగా చికిత్స చేయించి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడంతో బుధవారం మణికుమారి ఆరోగ్యం మరింత విషమించింది. బుధవారం రాత్రి మీ కుమార్తె ఆరోగ్యం బాగాలేదని కాకినాడ ప్రభుత్వ సుపత్రిలో చేర్పించినట్లు సమాచారం వచ్చింది. అక్కడ వెళ్లిన తల్లిదండ్రులు ఆసుపత్రి సిబ్బంది అంతా బాగానే ఉంది ఇంటికి తీసుకెళ్లమన్నారు. దీంతో మణికుమారిని హసన్ బాద వచ్చారు. గురువారం విద్యార్థిని తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో తిరిగి కాకినాడ తీసుకెళ్తుండగా అప్పటికే పరిస్థితి విషమించడంతో విద్యార్థిని మణికుమారి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. విద్యార్థిని మతితో దళితవాడలో విషాదం నెలకొని ఉంది. తమ కుమార్తె మృతికి హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమేనని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు తమకు ముగ్గురు సంతానమని, అందరిలోనే చిన్నదైన మణి కుమారి మృతిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకవైపు హాస్టల్ వార్డు మరోవైపు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమార్తె మతి చెందినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాం: వార్డెన్

విద్యార్థిని మణికుమారి మృతికి హాస్టల్ వార్డెన్ వాణి నిర్లక్షమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణపై.. వార్డెన్ వాణి ని వివరణ కోరగా గత ఆదివారం నుంచి విద్యార్థిని అనారోగ్యానికి గురైందన్నారు. అయితే స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి బాగానే ఉండడంతో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించామన్నారు. అయితే విద్యార్థినికి వచ్చిన వ్యాధి ఏంటో తనకు కూడా తెలియదన్నారు. కుమార్తె చనిపోయిన బాధలో ఉన్న తల్లిదండ్రులు తాము నిర్లక్ష్యం వ్యవహరించినట్లు ఆరోపిస్తున్నారని వివరించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె వివరించారు.

బైక్ చోరీ కేసులో యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణంలోని బైక్ చోరీ కేసులో ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు పంపినట్లు ఎస్ఐ శేరు నూకరాజు శుక్రవారం తెలిపారు. ఈనెల 15న గొలగాబత్తుల వారి వీధిలో నివాసముంటున్న తోట వీరభద్రరావు తన బైక్ పోయిందని యానాం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా నిందితుడు నీలపల్లి చెక్కావారి పేటకు చెందిన సంగాని గంగాద్రిగా గుర్తించారు. నిందితుడు నుండి బైక్ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

తెనాలి రైల్వే పోలీసులకు బాలుని అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

గుంటూరు జిల్లా ఉప్పాల మండలం మాగల గ్రామానికి చెందిన బాలుడు చెవుల వెంకట దుర్గాప్రసాద్(15)ను తెనాలి రైల్వే పోలీసులకు సామర్లకోట జీఆర్పి పోలీసులు శుక్రవారం అప్పగించారు. తెనాలి హాస్టల్ నుంచి బయటకు వచ్చిన వెంకట దుర్గాప్రసాద్ సామర్లకోట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు తెనాలి రైల్వే అధికారులు స్థానిక జి ఆర్ పి పోలీస్ స్టేషన్లో సమాచారం అందించారు. వారు అందించిన వివరాలు ప్రకారం దుర్గా ప్రసాద్ను జీఆర్పి పోలీసులు వెతికి పట్టుకున్నారు. అనంతరం తెనాలి స్టేషన్ అధికారులకు సమాచారం అందించగా తెనాలి నుంచి వచ్చిన మాస్టర్ ఎం.ఎస్ చక్రవర్తికి స్థానిక స్టేషన్ సిబ్బంది వెంకట దుర్గాప్రసాద్ ను అప్పగించారు.

వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామ శివారు శ్రీ సాయి బాలాజీ హోటల్ వద్ద ఈ నెల 16న తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఒక వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.గణేష్కుమార్ తెలిపారు తాళ్లూరు గ్రామస్తుడైన మింది రామచంద్రరావు తాళ్లూరు హోటల్ వద్ద కాకినాడ.. ఉప్పలపాడు గ్రామస్తులైన ఎర్రమనీడి వరప్రసాద్ బాదం చిన వీర్రాజు అడబాల చక్ర దొరబాబు అనే ముగ్గురు వ్యక్తులను టీ తాగడానికి డబ్బులు అడిగాడు. దీనిపై ఆ ముగ్గురు మమ్మల్ని డబ్బులు అడుగుతావా? ఏదైనా పని చేసుకుని బతకచ్చు కదా అని చెప్పి విచక్షణారహితంగా అతనిని కొట్టి గాయపరిచారు. దీంతో మింది రామచంద్రరావును రాజమహేంద్రవరం హాస్పిటల్లో చికిత్స తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి ముగ్గురు వ్యక్తులపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి త్వరలోనే కోర్టుకి హాజరుపరుస్తామని, వారి ముగ్గురిపై కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సిఐ బి. సూరి అప్పారావు తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన వాదాల కుంట శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు యలమాటి వెంకటేశ్వరరావు పొగాకు బ్యారన్ రేజింగ్ సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో పొగాకు, బ్యారన్ సామగ్రి పూర్తిగా దగ్ధమైందని ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసినప్పటికీ పూర్తిగా పొగాకు, బ్యారన్ సామగ్రి ధ్వంసమై సుమారు రూ.ఆరు లక్షలు నష్టం వాటిలినట్లు తెలిపారు.

యానాం వార్తలు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - యానాం


సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ అశోక్

యానాంలో దీర్ఘకాలంగా ఉన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో పలు సమస్యలపై ప్రశ్నించారు. ఎస్సీలకు ఆది ద్రావిడ శాఖ ద్వారా 1996-98లో తుఫాను సమయంలో పంపిణీ చేసిన రూ.36వేలు, రూ.40వేల స్కీమ్ ద్వారా నిర్మాణమైన గృహాలు శిధిలమై ఉన్నాయని పలువురు ఇంకా వాటిలోనే నివసిస్తున్నారని తక్షణం ఆ స్కీమును రద్దుచేసి రూ.5లక్షలు చొప్పున ఆర్థికసహాయం అందించాలని కోరారు. రక్షిత మంచినీటిని అందించాలని, పలు రోడ్లు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా వెనుకకు పంపినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకశాఖ ద్వారా కోట్లాది రూపాయల ఖర్చుతో పలు చోట్ల పుద్దగా అనేక ప్రాజెక్టులు నిర్మాణం చేశారని ప్రస్తుతం అవి శిథిలస్థితికి చేరుకున్నాయన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆదాయం వచ్చేవిధంగా మలచాలని కోరారు. లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా అవుట్ సోర్సింగ్ నియామకాలు చేపట్టాలని కోరారు. పాత దేవస్థానం కమిటీ, మాజీలుగాఉన్న కొందరు అనాలోచితంగా 600 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూల్చేశారన్నారు. ఆదేవిధంగా కమిటీకి సంబంధించి అకౌంట్లు నిర్వహణ సైతం చేయలేదని దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరారు. యానాం మున్సిపాలిటీ సిబ్బందికి బకాయి జీతాలు రూ. 3 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది జీతాలు ఇవ్వడానికి మద్యం బాటిల్స్పై రూ.5లు పన్ను వేయాలని గతంలో కోరానని గుర్తు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సామాన్య ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పిసిఎస్ స్థాయి అధికారిని నియమించాలని కోరారు.

దరియాలతిప్ప ఆయకట్టుకు నీరందించాలి

దరియాలతిప్ప ఆయకట్టుకు నీరందించాలని శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామిని కలిసి రైతులు వినతిపత్రాన్ని అందించారు. దరియాలతిప్ప గ్రామ ప్రజలు సాగు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. పిడబ్ల్యుడి అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గ్రామానికి సరిగ్గా నీరు అందడం లేదని వాపోయారు.దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నీరు అందించాలని కోరారు. కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి, కొల్లు భైరవమూర్తి పాల్గొన్నారు.

ఆపద మిత్రపై యువతకు శిక్షణ

డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్కె ఆర్ట్స్ కళాశాలలో ఆపద మిత్రపై యువతకు శిక్షణా తరగతులు శుక్రవారం ఆర్ ఏ ఓ మునిస్వామి ప్రారంభించారు. కొలతలు తూనికలు శాఖ డిటి గణేషన్ మాట్లాడుతూ తుఫాను వంటి ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్థానిక పౌరులు ముందుగా అత్యవసర విధుల్లో పాల్గొని సహాయ సహకారాలు ఏ విధంగా అందించాలో వివరించారు. శిక్షణకు సుమారు 70 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కనకాల శ్రీనివాస్,సుభాన్,రషీద్ ఎస్ఆర్కే ఆర్ట్స్,ఐటిఐ,మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభించాలి

యానాం నియోజకవర్గ పాఠశాలలలో ఒంటిపూట బడులు ప్రారంభించాలని యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పుదుచ్చేరి విద్యాశాఖ డైరెక్టర్కు వినతి పత్రాన్ని పంపినట్లు ప్రెసిడెంట్ ఎస్ఏ వలీ తెలిపారు. ఒక వైపు వేసవి మరో వైపు వాతావరణ పరిస్థితులు కారణంగా విద్యార్థులకు విషజ్వరాల వచ్చే అవకాశం ఉందని వాటి నుండి రక్షించడానికి ఒంటి పూట బడులు ప్రారంభించాలని దానికి సంబంధించిన ఆదేశాలు జారీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం ఆర్ ఏ ఓ మునిస్వామి, యానాం విద్యశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ను కలిసి వినతి పత్రాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో తోట వెంకన్న, పి సత్తిబాబు, కళ్యాణ్, నల్లా రత్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిఐపై హత్యాయత్నం దారుణం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్


సమావేశంలో మాట్లాడుతున్న డిటిసి ప్రసాదరావు, సిబ్బంది

విధులు నిర్వహిస్తున్న కాకినాడ రవాణా శాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ మిద్దే చిన్నారావుపై హత్యాయత్నం జరగడం దారుణమని రవాణాశాఖ ఉప కమిషనర్ ఎవి ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ ప్రసాద రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద రావు మాట్లాడుతూ కాకినాడలో శుక్రవారం ఉదయం కొబ్బరి బోండాలు అమ్మే వ్యక్తి చేసిన దాడిలో తీవ్రంగా గాయ పడిన అసిస్టెంట్ మోటర్ ఇన్స్పెక్టర్ చిన్నారావు ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారని, విధుల నిర్వహణలో ఉన్న అధికారి పై ఏవిధమైన దాడి జరగడం చాలా విచారకరమన్నారు. ఈ సంఘ టనపై రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ ఈ ఘటనపై తీవ్రంగా ఖండించారని తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం.రవీంద్ర నాథ్ బాబు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారని చట్ట ప్రకారం చర్యలు తీసుకుని శిక్ష పడేటట్లు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషన్ సిహెచ్ శ్రీదేవి, రవాణా శాఖ అధికారులు ఐ.రాజబాబు, ఆర్ సురేష్, పివి.సాయిబాబు, మురకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత 2023 అవార్డులకు ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపించిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా 2023 సంవత్సరానికి అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ జై సురేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత,స్వయం సహాయక,చిన్న తరహా,సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెక్కతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభలో అవార్డులు బహూకరిస్తారన్నారు.

ఏలేశ్వరం కమిషనర్గా శీనివాస్

ప్రజాశక్తి - ఏలేశ్వరం


శ్రీనివాసరావు

ఏలేశ్వరం ఎఫ్ఏ సి కమిషనర్గా కె.శ్రీనివాసరావు నియమితుల య్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం అధికారుల నుండి నియామక ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం మేనేజర్గా కొనసాగుతున్న శ్రీనివాసరావు కమిషనర్గా బాధ్య తలు స్వీకరించడంపై పలువురు అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలోని ఇన్చార్జి కమిషనర్గా పని చేసిన అనుభవంతో అభివృద్ధికి పాటుపడతానన్నారు.

85 మందికి కళ్లజోళ్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీలో వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తమాలజిస్ట్ సత్తిబాబు కంటి రోగులకు పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సకు కాకినాడ జిజి హెచ్కు తరలించారు. 85 మందికి కళ్ళజోళ్ళు రెండు నుంచి మూడు నెలల్లో ప్రభుత్వం నుంచి ఉచితంగా రానున్నట్లు సత్తిబాబు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, ఎంపీటీసీలు,ఏఎన్ఎం. రోజా, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని పలు గ్రామాలలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో విజయ భాస్కర్ తెలిపారు. మండలంలోని కరకుదురు-1 పెదపూడి 1, పుట్టకొండ 1, వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి అర్హత కలిగిన వారు ఈనెల 21 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మేజర్ డ్రైన్లలో పూడిక తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మేజర్ డ్రైన్లలో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దుమ్ములపేట, సంజయ్ నగర్, అక్షర స్కూల్ ప్రాంతాలలో రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న డ్రెయిన్లను పరిశీలించారు. వర్షాలు పడితే డ్రెయిన్లు మునిగే పరిస్థితి ఉన్నందున తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కాకినాడ నగరంలోని చిన్న డ్రెయినేజీలలో డీ-సిల్టేషన్ పనులు ప్రారంభించా మన్నారు. మేజర్ డ్రెయిన్లు ఇంజనీరింగ్ విభాగం చేపట్టాల్సి ఉన్నందున సంబంధిత డీఈలు, ఏఈలు చొరవ తీసుకోవాలని ఏ డి సి సూచించారు. ముందస్తు ప్రణాళిక లేకపోతే రానున్న వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నందున ఇప్పటినుంచి తగిన జాగ్రత్తలు వహించాలని ఏడిసి నాగ నరసింహారావు కోరారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. .ఆయన వెంట నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పద్వీచరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు..

189వ రోజు గడప గడపకు..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామంలో 189వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇంఛార్జి దవులూరి దొరబాబు నిర్వహిరారు. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి బోరు పనులను కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు. అలాగే గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ కుటుంబాన్నీ కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటన్నిటినీ పరిష్క రించ నున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సామర్లకోట ఎఎంసి చైర్మన్, మాజీ ఎంపిపి మేడిశెడ్డి వీరభద్రం, సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ,కాకినాడ జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులు మేడిశెట్టి బుజ్జి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దంత వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి -ఏలేశ్వరం

దంత సంబంధమైన ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ శైలజ పిలుపునిచ్చారు. ఈనెల 20 న ప్రపంచ దంత వైద్య దినోత్సవం పురస్కరించుకొని స్థానిక భవిత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో నూటికి 90 శాతం జీవిత కాలంలో దంత వ్యాధులతో బాధపడు తున్నారన్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా 40 నుండి 90 శాతం మంది పిల్లలకు దంతక్షయం ఉందని అందులో 10 శాతం మంది మాత్రమే దంత ఆరోగ్య సంరక్షణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని 1,29 వార్డులలో రూ 30 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అభివద్ధి పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ పి ఆదినారా యణరావు, అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణ జీవ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, యండమూరి విజయలక్ష్మి, విడదాసరి రాజా, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు ధర్మేంద్ర,పెద్ద పాల్గొన్నారు.

ఎంపీ అనురాధ నియామకంపై హర్షం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యురాలుగా అమలాపురం ఎంపీ చింతా అనురాధ నియామకం పట్ల శుక్రవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరి బాబి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టి కల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైసిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు తదితరులు ఉన్నారు.

లైంగిక వేధింపులపై నిజనిర్ధారణ

ప్రజాశక్తి - అమలాపురం

అంబాజీపేట మండలం పెదపూడిలో పనిచేస్తున్న హెల్త్ వర్కర్పై లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి మానవ హక్కుల వేదిక సభ్యులు ముగ్గురు శుక్రవారం నిజ నిర్ధారణ చేపట్టారు. హెల్త్ వర్కర్ తనను గ్రామ సర్పంచ్ భర్త బీర రాజారావు, హెల్త్ సూపర్వైజర్ నెల్లి మధుబాబు వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం ఆమె ఫిర్యాదుపై నిష్పాక్షికమైన విచారణను చేపట్టాలని, నిందితులతో ఎటువంటి సంబంధము లేని వాళ్ళని మాత్రమే విచారణ కమిటీ సభ్యులుగా నియమించాలని మానవ హక్కులు వేదిక డిమాండ్ చేస్తోందనీ వేదిక సభ్యులు బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. తదుపరి ముక్కామల పిహెచ్సి వైద్యాధికారిని, అలాగే డిఎంహెచ్ఒ ఆఫీస్ ఎఒని కలిసి విషయ సేకరణ చేశారు. బాధితురాలి ఫిర్యాదుపై విచారణ చేయడానికి చట్ట ప్రకారం కమిటీని నియమించాలని దానిలో ఇద్దరు మహిళలు ఉండాలని వేదిక సభ్యులు అన్నారు. 2013లో వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు ఘోరంగా ఉందని వేదిక సభ్యులు అన్నారు. ఈ చట్టం అమలుకు జిల్లా యంత్రా ంగం తగు చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేస్తోంది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. పుష్పవల్లి, పి పవన్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ గోరంట్లకు అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

దుర్భర పరిస్థితుల్లో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తికి రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చి చౌదరికి చేనేత కార్మిక నేత నల్ల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో చేనేత వృతి మీద ఆధారపడి జీవించే వారందరికీ ఉపాధి లేక ఆత్మహత్యలే శరణ్యమని దశకు చేరుకుంటున్నారని రామారావు అన్నారు. దీనిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉపాధి కలిగేటట్లు సొసైటీలకి ఆప్కో ఇవ్వాల్సిన బాకీలు చెల్లించే విధంగా, కేంద్ర ప్రభుత్వం చేనేత పై వేసిన జిఎస్టి ద్దుచేసి చేనేతను ప్రోత్సహించే విధంగా, బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించి ఆదుకోవాలన్నారు. అధికార పక్షంలో ఉన్న నాయకులు అందరూ చేనేత పరిశ్రమ రక్షించాలన్నారు.

ప్రజల్లో ప్రారంభమైన మార్పు : గన్ని

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు పడగొట్టడానికి సిద్ధంగా ఉన్నారనడానికి గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని, ప్రజల్లో పెను మార్పు ప్రారంభమైందని గుడా మాజీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే విశాఖను రాజధానిగా చేయాలన్న జగన్ తుగ్లక్ నిర్ణయాన్ని ప్రజలు తిరస్కరించారనడానికి గొడ్డలిపెట్టు అని గన్ని వ్యాఖ్యానించారు. తాను ఒక ఆర్థికవేత్తనని చెప్పిన జగన్ ఆంధ్రప్రదేశ్ను అప్పుల ప్రదేశ్గా మార్చారని, వారి అప్పుల దెబ్బకు రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసేస్తోందన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

ఎండపల్లి గ్రామం శివారు జొన్నలగరువులో ఉన్న తాటాకు ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్తో గురువారం పూర్తిగా కాలిపోవడంతో విషయం తెలుసుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మ శుక్రవారం నాయకులతో కలిపి కాలిపోయిన తాటాకు ఇల్లును పరిశీలించి ఇంటి యజమాని బత్తిన రజినికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుండి రావలసిన నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈయన వెంట అనిశెట్టి సత్యానంద రెడ్డి, ఎంపీటీసీ సత్తిబాబు, రవి, కాశి బాబు తదితరులు ఉన్నారు

పుంత రోడ్డు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరంలో జెడ్పి ఉన్నత పాఠశాల చెంతనే ఉన్న పుంత రోడ్డు అభివృద్ధి పనులు శుక్రవారం నుంచి జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులు రూ. 4 లక్షలు, మండల నిధులు రూ. 2 లక్షలతో గ్రావెల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. స్కూలు నుంచి పాలతోడు రావిచెట్టు వరకు సుమారు కి.మీ ఉన్న ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తామని మండల జెఇ నాగేశ్వరరావు తెలిపారు.

ఇష్టారాజ్యంగా అనధికార నిర్మాణం

ప్రజాశక్తి - మండపేట

అధికార పార్టీ నాయకుల అండదండలతో కలువపువ్వు సెంటర్లో అక్రమార్కులు ఇష్టా రాజ్యంగా భవన నిర్మాణం సాగిస్తున్నా అధికారులు పీవో నోటీస్ ఇచ్చామని చెప్పడం సిగ్గు చేటని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ నిర్మాణం జరిగిపోతున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. జిల్లా ఏడిద రోడ్డులోని కల్యాణి రైస్ మిల్ పక్కన నిర్మించిన గోదామును నేలకూల్చిన కమిషనర్ ఇక్కడ మాత్రం నోటీసలతో ఎందుకు సరిపెట్టారో సమాధానం చెప్పాల న్నారు. ఒకప్పుడు అక్రమం అయిన గోదాము నిర్మాణం ఇప్పుడు అదే చోట నిర్మాణం జరిగి పోతోందని అప్పుడు తప్పయిన నిర్మాణం ఇప్పుడు ఒప్పెలా అయ్యిందో కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్లో అడ్డుగా వున్న వేగుళ్ల వీర్రాజు విగ్రహాన్ని తొలగిస్తే ట్రాఫిక్ ఇబ్బందుల ఉండవన్నారు. రాజకీయ ఒత్తిడులకు, అక్రమార్కులకు కొమ్ము కాయకుండా మసీదుని ఆనుకుని జరుగుతున్న నిర్మాణాన్ని కూల్చి వేయాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్ అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తానని కామన హెచ్చరించారు.

వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మవారికి కాండ్రకోటకు చెందిన గంటా రామకష్ణ కుటుంబ సభ్యులు కాకినాడ వాస్తవ్యులు మల్లిపూడి లక్ష్మణ మూర్తి, ఉమాదేవి దంపతులు శుక్రవారం రెండు కిలోల వెండి ఆభరణాలు సమర్పించారు.వీటిని ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణమూర్తి కి అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు, ఆలయ చైర్మన్ గవరసాన వీరస్వామి, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఉపసర్పంచ్ జోకా నానాజీ, గంట రామస్వామి, గవరసాన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** శుక్రవారం కపిలేశ్వరపురంలో నూకాల మ్మ అమ్మవారి గరగను గ్రామ వీధుల్లో ఊరేగింపు జరిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 19న అమ్మవారి చిన్న జాతర, 20 న పెద్ద జాతర, 21న తీర్థం, నైవేద్యాలు , 22 ఉగాదితో ఉత్సవాలు ముగిస్తాయన్నారు.


'స్వచ్ఛత' అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మండపేట

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు పట్టణ మహిళలలు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు కమిషనర్ టి.రాంకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. పట్టణ పరిధిలో మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుధ్యం, వ్యర్థ ఘన పదార్థాల నిర్వహణలో ప్రతిభ కనబరచిన మహిళలు, ప్రజా మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకులు క్లినింగ్ సర్వీసులు, తడి పొడి చెత్త సేకరణ, చెత్తను తరలించు పద్ధతులు, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించుట, చెత్త నుండి సంపదను సృష్టించు పద్ధతులు, తదితర అంశాలపై సాంకేతికత, నూతన ఆవిష్కరణలు విభాగాల క్రింద కృషిచేస్తున్న స్వయం సహాయక సంఘాలు, మైక్రో ఎంటర్ ప్రైజెస్, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్స్ ఇతర విభాగములకు చెందిన మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆశక్తి కలిగిన మహిళలు ఈనెల 22తేదీ లోపు పురపాలక సంఘ మెప్మా విభాగములో దరఖాస్తులను అందజేయలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులను అందజేస్తామన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

ప్రజాశక్తి- కరప


దాతను సత్కరిస్తున్న దృశ్యం

కరప నక్కా సూర్యనారా యణ మూర్తి జడ్పి ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయులు గెడ్డం కుమారి ఝాన్సీ, అద్దంకి వెంకటేశ్వరరావులు రూ. 60 విలువ చేసే కంప్యూటర్ను అందజేశారు.కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ ముఖ్యఅతిథిగా కంప్యూటర్ ప్రారంభించి, కంప్యూటర్ను పాత రికార్డులు పునర్వ్యవస్థీకరణ చేసేందుకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం లీలా మనోహర్, పూర్వ విద్యార్థులు చాగంటి సూరిబాబు, ముద్రగడ పెద్దకాపు, గొర్రెల వెంకన్న, గంధం పెదబాబు, వాసంశెట్టి ప్రసాద్, మాజీ స్కూల్ చైర్మన్ వీర్రాజు, ఉపాధ్యాయులు, ఎం రమేష్, రికార్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.